క్లుప్తంగా

పి.కొత్తపల్లిలో ఉద్రిక్తత

నల్లచెరువు : పి.కొత్తపల్లిలోని 213వ నంబర్ పోలింగ్ కేంద్రంలో సోమవారం సాయంత్రం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం 766 ఓట్లు ఉన్నాయి. నిర్దేశిత ఆరు గంటలు దాటిన తర్వాత చాలామంది క్యూలో ఉన్నారు. అయితే అక్కడ ఉన్న వారు కాకుండా ఇతరులను తీసుకురావడానికి టీడీపీ నాయకులు ప్రయత్నించారు. దీనికి వైఎస్సార్‌సీపీ ఏజెంట్ యుగంధర్‌రెడ్డి, ఓటరు శివారెడ్డి అభ్యంతరం తెలపడంతో టీడీపీకి చెందిన శ్రీనాథ్, కుమార్, నవీన్‌తో పాటు పి.కొత్తపల్లి పంచాయతీ సర్పంచ్ సావిత్రమ్మ భర్త సూర్యనారాయణ ఆగ్రహించి దాడికి తెగబడ్డారు. క్యూలో ఉన్న వారిని మాత్రమే ఓటు వేయడానికి అనుమతించండని సూచించిన సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ నిరంజన్‌రెడ్డిని సైతం తోసేశారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



కాళసముద్రం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించేందుకు వస్తున్న బీఎస్ మక్బూల్ అహ్మద్

కదిరి అర్బన్: కాళసముద్రం పోలింగ్ కేంద్రాన్ని సోమవారం వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ పరిశీలించారు. పోలింగ్ సరళిని కేంద్రంలో పరిశీంచారు. సజావుగా పోలింగ్ జరిగేందుకు ఓటర్లు సహకరించాలన్నారు. ఆయన వెంట మాజీ మంత్రి మహ్మద్ షాకీర్, మాజీ సర్పంచ్ ఇంద్రప్రసాద్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ ప్రభంజనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్

కదిరి టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో కదిరి నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ ప్రభంజనం సృష్టించిందని కదిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీ.ఎస్.మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరగడానికి సహకరించిన అన్ని పార్టీల నాయకులు, ఓటర్లతో పాటు అధికారులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఒక వైపు ఎండలు మండుతున్న పెద్ద ఎత్తున జనం బారులుదీరి గంటల తరబడి వేచి ఉండి ఓటేశారన్నారు. జగనన్న అందించిన సంక్షేమం ద్వారా లబ్ధి పొందిన ప్రతి మహిళ ఓటు వేయడానికి ఆసక్తి చూపారనడానికి ఈరోజు జరిగిన పోలింగ్ శాతమే నిదర్శనంగా చెప్పవచ్చన్నారు. నిరుపేదలకు మంచి చేస్తే వారు మరింత ఆదరిస్తారని తేటతెల్లమైందన్నారు. కూటమి సభ్యుల మోసాలను పసిగట్టిన రాష్ట్ర ప్రజలు ఓటుతోనే వారికి తగిన బుద్ధి చెప్పినట్లు స్పష్టమవుతోందన్నారు.

ప్రశాంతంగా సార్వత్రిక పోలింగ్

- పోలింగ్ కేంద్రాలకు పోటెత్తిన ఓటర్లు
- మండుటెండను లెక్కచేయకుండా ఓటింగ్

కదిరి: కదిరి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగింది. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఎన్నికల పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. పోలింగ్ ముగిసే సమయానికి క్యూలైన్‌లలో ఉన్న ఓటర్లందరితో ఎన్నికల నిబంధనల ప్రకారం ఆ తర్వాత కూడా ఓటు వేయించారు. పోలింగ్ ముగిసే సమయానికి(సాయంత్రం6) నియోజకవర్గ వ్యాప్తంగా 72.24 శాతం పోలింగ్ నమోదైంది. ఆ తర్వాత కూడా క్యూలైన్‌లలో ఉన్న వారు ఓటు వేశారు కాబట్టి పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ పట్టణంలోని వైఎస్సార్ నగర్‌లో ఉన్న పోలింగ్ కేంద్రం, ఎమ్మెల్యే అభ్యర్థి మక్బుల్, సిట్టింగ్ ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి, ఏపీపీఎస్‌సీ ఇన్‌చార్జ్ చైర్మన్ డా.జీవీ సుధాకర్ రెడ్డి, ఇంకా పలువురు నాయకులు తమ పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఉదయాన్నే బారులుదీరిన ఓటర్లు

ఉదయం 6 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ముఖ్యంగా మహిళా ఓటర్లు పెద్ద సంఖ్యలో క్యూలైన్‌లలో గంటల తరబడి వేచి ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధులు సైతం ఈసారి తమ కుటుంబ సభ్యుల సహకారంతో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటువేయడం కన్పించింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉదయం 9 గంటలకు 8.71 శాతం, 11 గంటలకు 25.71 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 45.83 శాతం, సాయంత్రం 3 గంటలకు 56.77 శాతం, 4 గంటలకు 63.20 శాతం, పోలింగ్ ముగిసే సమయం సాయంత్రం 6 గంటలకు 72.24 శాతం మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు కదిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి సన్నీ వంశీకృష్ణ తెలిపారు.

పోలింగ్ శాతాన్ని తగ్గించే యత్నం

ఓటర్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని గ్రహించిన టీడీపీ నాయకులు ఎలాగైనా పోలింగ్ శాతాన్ని తగ్గించాలని భావించారు. ముఖ్యంగా కదిరిలో ముస్లిం మైనార్టీ ఓటర్లు ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ ఏజెంట్లు అడుగడుగునా పోలింగ్‌కు అడ్డుతగులుతూ వచ్చారు. అయితే ఓటర్లు మాత్రం ఎంత ఆలస్యమైనా తమ ఓటు హక్కును వినియోగించుకొనే ఇంటికి వెళ్లారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్‌తో పాటు ఆయన సతీమణి యశోదమ్మ, ఇంకా టీడీపీ కార్యకర్తలు పదే పదే పట్టణంలోని చావిడి పోలింగ్ కేంద్రంలోకి వస్తూ అక్కడున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆఖరుకు ఓటర్లపైన కూడా తమ కోపాన్ని చూపించారు. ఓటర్ల ముందే పట్టణ సీఐ పులయ్యను సైతం కందికుంట బెదిరించడం కన్పించింది. ఓటమి భయంతో తమ నాయకుడు కందికుంట రోజంతా అసహనంతో పార్టీ కార్యకర్తలపై కూడా కోప్పడుతున్నాడని టీడీపీకే చెందిన ఓ నాయకుడు అన్నారు. మొత్తంమీద కదిరి డీఎస్పీ శ్రీలత నేతృత్వంలో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్త్ మధ్య పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.



కదిరిలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు



తనకల్లు మండలం సున్నంవారిపల్లిలో ఓటు వేసేందుకు క్యూలో మహిళలు

ఎన్పీకుంటలో..

ఎన్పీకుంట: మండలంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 14 గ్రామ పంచాయతీల్లోని 30 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ కొనసాగింది. పలు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో ప్రారంభంలో పోలింగ్‌కు కాసేపు అంతరాయం కలిగింది. నిర్ణీత సమయంలో క్యూలైన్‌లో చేరిన వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. పలు చోట్ల చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా 24,552 మంది ఓటర్లు ఉండగా 84 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తహశీల్దార్ నరేంద్రకుమార్ తెలిపారు.

గాండ్లపెంటలో..

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. కాగా కురుమామిడి పంచాయతీ రెక్కమాను మహిళలు, పురుషులకు ఒకే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో పోలింగ్ రాత్రి 10 గంటల వరకూ కొనసాగింది. మహిళలు ఓటు వేసేందుకు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. మండలవ్యాప్తంగా 21,451 మంది ఓటర్లున్నారు. మొత్తం 18,255 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు.



గాండ్లపెంట మండలంలో రెక్కమాను పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఓటర్లు



గాండ్లపెంటలో ఉదయం 6:30 గంటలకే క్యూలో ఉన్న ఓటర్లు



కదిరిలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసినట్లు చూపుతున్న ఏపీపీఎస్సీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి



మొదటి ఓటు హక్కును వినియోగించుకున్న ఆనందంలో యువకులు



ఓటు వేయడానికి ఎన్పీకుంట 188 పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళలు

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



తలుపులలో ఓటు వేయడానికి క్యూలో ఉన్న ఓటర్లు

తలుపుల : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం మండలవ్యాప్తంగా చిన్న చిన్న సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతగా ముగిసింది. తలుపుల పోలింగ్‌స్టేషన్‌లో రాత్రి 7 గంటల వరకు క్యూలో ఓటర్లు ఉన్నారు. మండలంలో 33,512 ఓటర్లు ఉన్నారు. ఉదయం 6 గంటలకు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ఓటింగ్ శాతం పెరిగింది. ఓటు వేయడానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో గ్రామాల్లో సందడి నెలకొంది.



తలుపులలో ఓటు వేసి వస్తున్న 95 ఏళ్ల వృద్ధుడు

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు



ఓటు వేసినట్లు చూపుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి దంపతులు



ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి రంగన అశ్వర్థనారాయణ దంపతులు

ధర్మవరం/ధర్మవరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తన సతీమణి సుప్రియ, సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, మరదలు వసుమతితో కలిసి కాలేజీ సర్కిల్‌లోని ప్రభుత్వ పాఠశాల(పోలింగ్ బూత్ నంబర్ 201)లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రంగన అశ్వర్థ నారాయణ పట్టణంలోనే ఓటు వేశారు.

ధర్మవరం రూరల్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ తమ ఓటును తన స్వగ్రామమైన ధర్మవరం మండలం నేలకోట తండాలో వినియోగించుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన క్యూలో నిలుచుకొని ఓటు వేశాడు.



ఓటు వేసిన బీజేపీ అభ్యర్థి సత్యకుమార్

త్రుటిలో తప్పిన ప్రమాదం

తలుపుల: మండలంలోని తలుపుల– బత్రేపల్లి రోడ్డుపై కల్లీల మిట్ట వద్ద సోమవారం రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. తలుపుల ఎస్ఐ దిలీప్‌కుమార్ తలుపుల వైపు నుంచి బత్రేపల్లికి వెళ్తుండగా కల్లీల మిట్ట వద్ద ఎదురుగా కారు రావడంతో ఒక్కసారిగా ఢీకొన్నాయి. ఘటనలో ఎస్ఐకి ఎలాంటి గాయాలు కాలేదు. మరోకారులో ఉన్న ఐదుగురికి స్వల్పంగా గాయపడడంతో వెంటనే వారిని కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు





గాయపడిన అనిల్, పాండు

బత్తలపల్లి: అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై ఉప్పర్లపల్లి క్రాస్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉరవకొండకు చెందిన అనిల్, పాండు గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకుని చిత్తూరుకు బైక్‌పై పని నిమిత్తం బయలుదేరారు. ఉప్పర్లపల్లి క్రాస్ వద్దకు రాగానే జాతీయ రహదారి పనులు చేస్తున్న విషయం గమనించకుండా కంకర కుప్పను ఎక్కించి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారికి స్థానికులు వెంటనే బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తీసుకెళ్లారు.

సంక్షేమ పాలనకే పట్టం



పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల జోరు చూస్తుంటే రాష్ట్రంలో సాగుతున్న సంక్షేమ పాలనకే ప్రజలు పట్టం కట్టినట్లు కనిపిస్తోందని ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి పోలింగ్ నమోదును పరిశీలించారు. టీడీపీ నాయకులు కుట్ర రాజకీయాలతో పాటు డబ్బులు ఎరచూపినా ఓటర్లు ప్రలోభాలకు లోనుకాకుండా వైఎస్సార్‌సీపీకే మద్దతు పలికారన్నారు. ఈ ఎన్నికల్లో రాప్తాడు నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో తాను గెలుపొందటంతో పాటు రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాలను వైఎస్సార్‌సీపీనే కైవసం చేసుకొంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకె లక్ష్మన్న, వలగొండ భాస్కర్, చిన్నూరు రాము, అశోక్, గోపాల్, ఆలమూరప్ప, రమేష్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి/చెన్నేకొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఓటర్లు పోటెత్తారు. చిన్న ఘర్షణలు, స్వల్ప సంఘటనలు మినహా రాప్తాడు నియోజకవర్గం వ్యాప్తంగా సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ ఎన్నికల పోలింగ్‌లో నియోజకరవర్గంలోని 281 పోలింగ్ స్టేషన్లలో సుమారు 2 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక రాప్తాడు, చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాలలో ఉదయం కొంత పోలింగ్ శాతం తక్కువైనా, మధ్యాహ్నానికి పోలింగ్ శాతం పెరిగింది. సాయంత్రానికి చాలా కేంద్రాల్లో 75 శాతంపైగా పోలింగ్ నమోదైంది. ఇక చెన్నేకొత్తపల్లి మండలం వెంకటంపల్లి, ఓబుళంపల్లి, మేడాపురంలో గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్తున్న టీడీపీ నాయకుడు ఎల్ నారాయణప్పను స్థానికులు అడ్డుకొన్నారు. దీంతో కొంతసేపు ఆయా గ్రామాల్లో ఉద్రిక్తత నెలకొంది. కనగానపల్లి మండలంలోని నెమలివరం, యలకుంట్ల, బాలేపాళ్యం గ్రామాల్లో స్థానిక వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య తోపులాటలు జరిగాయి. సకాలంలో పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. చెన్నేకొత్తపల్లి మండలంలో అక్కడక్కడ వర్షం కురిసింది. అయినా ఓటర్లు వర్షంలో క్యూలైన్‌లో నిలుచుకుని ఓటు ఏశారు. మండలంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామగిరి సీఐ శివాంజనేయులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు వారి సిబ్బంది పర్యవేక్షించారు.



కనగానపల్లిలో పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన మహిళా ఓటర్లు

పోటెత్తిన ఓటర్లు



బత్తలపల్లిలోని పోలింగ్ కేంద్రం వద్ద ఉదయాన్నే బారులుదీరిన ఓటర్లు



బత్తలపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా పోలీస్ అబ్జర్వర్ రాహుల్‌దేవ్ సింగ్



తాడిమర్రిలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి క్యూకట్టిన ఓటర్లు



ముదిగుబ్బ మండలం సంకేపల్లిలో పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరిన ఓటర్లు



కొత్తపేటలో ఓటు వేసేందుకు వస్తున్న 95 ఏళ్ల వృద్ధుడు



ధర్మవరం లక్ష్మీనగర్‌లో బారులుదీరిన మహిళా ఓటర్లు



ధర్మవరంలో ఓటేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు



రామ్‌నగర్‌లో ఓటు వేసేందుకు వస్తున్న 90 ఏళ్ల వృద్ధురాలు

- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- ధర్మవరం నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతం

ధర్మవరం/ ధర్మవరం అర్బన్: ధర్మవరం నియోజకవర్గంలో ఓటర్ల చైతన్యం పోటెత్తింది. ఈవీఎంలు మొరాయించినా... ఉక్కపోతతో ఇబ్బంది పెట్టినా... దేనికి వెరవకుండా గంటల కొద్దీ క్యూలైన్లలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ, టీడీపీ శ్రేణుల కవ్వింపు చర్యలతో చెదురుమదురు సంఘటనలు మినహా ధర్మవరం నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

వెల్లివిరిసిన మహిళా చైతన్యం....

మునుపెన్నడూ ఏ ఎన్నికల్లో చూడని విధంగా మహిళల్లో చైతన్య వెల్లివిరిసింది. నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలు ఉదయం 7గంటల నుంచి రాత్రి 8 గంటలైనా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. చంటిపిల్లలను చంకన వేసుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. చివరికి నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు సైతం తమ ఓటు హక్కును ఉపయోగించుకునేందుకు పోలింగ్ బూత్‌లకు వచ్చారు.

మొరాయించిన ఈవీఎంలు...

బత్తలపల్లి మండలం డీ.చెర్లోపల్లి, మాల్యవంతం గ్రామాలలో ఈవీఎంలు కాసేపు మొరాయించాయి. దీంతో ఎన్నికల అధికారులు ఈవీఎంలను మార్చారు. ధర్మవరం మండలం పోతుల నాగేపల్లి, తాడిమర్రి మండలం ఎం.అగ్రహారం గ్రామంలో కూడా ఈవీఎంలు మొరాయించాయి. ఎన్నికల అధికారులు వెంటనే స్పందించి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేశారు. పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు నిదానంగా పనిచేస్తుండటంతో ఓటర్లు గంటల కొద్ది వేచి ఉండాల్సి వచ్చింది. ఓటరు ఓటింగ్ వేసిన కాసేపటికి బీప్ సౌండ్ రావడంతో ఒక్కో ఓటరుకు 10 నిమిషాలపైనే సమయం పట్టింది.

బీజేపీ నాయకుల కవ్వింపు చర్యలు...

ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరుగుతుండగా పలు ప్రాంతాల్లో బీజేపీ, టీడీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద బీజేపీ, టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ నాయకులను రెచ్చగొట్టారు. పోలీసులు జోక్యం చేసుకుని గొడవలు జరగకుండా చర్యలు చేపట్టారు.

పకడ్బందీగా పోలీసుల బందోబస్తు...

ధర్మవరం నియోజకవర్గంలో పోలీసుల బందోబస్తు పకడ్బందీగా నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు సుబ్రహ్మణ్యం, అశోక్‌కుమార్, ఆరోహణరావు, ఎస్ఐలు శ్రీనివాస్, నరేంద్రలతోపాటు ఇతర మండలాల సిఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, సెంట్రల్ రిజర్వు పోలీసులు, కర్ణాటక, కేరళ పోలీసులతో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. చిన్నపాటి గొడవలు, ఘర్షణలకు ఎవరూ పాల్పడకుండా పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టారు.

బత్తలపల్లిలో 83 శాతం పోలింగ్

బత్తలపల్లి: మండలంలో సోమవారం సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి 83 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివశంకర్ నాయక్ తెలిపారు. మొత్తం 42 పోలింగ్ బూత్‌లలో 32,657 మందికిగాను 27,201 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. డి.చెర్లోపల్లి, దంపెట్ల, ఎం.చెర్లోపల్లి, వెంకటగారిపల్లి గ్రామాలలో స్వల్ప ఉద్రిక్తత వాతావరణం నెలకొనడంతో పోలీసులు కేంద్ర బలగాలతో ఇరువర్గాలను చెదరగొట్టారు. ఉదయాన్నే వాతావరణం అనుకూలించడంతో ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ఓటు హక్కును వినియోగించడానికి ఓటర్లు పోటెత్తారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఓటర్ల సందడి తక్కువగా ఉంది. పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరి కనిపించారు. బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ ఉదయాన్నే బత్తలపల్లిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా పోలీస్ అబ్జర్వర్ రాహుల్‌దేవ్ సింగ్ బత్తలపల్లిలోని పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు.

తాడిమర్రిలో..

తాడిమర్రి: మండలంలోని గ్రామాల్లో సోమవారం సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగాయి. మండలంలో తాడిమర్రి, పెద్దకోట్ల, కునుకుంట్ల, పిన్నదరి, దాడితోట, చిల్లవారిపల్లి, చిల్లకొండయ్యపల్లి, ఎం.అగ్రహారం, నార్సింపల్లి తదితర 31 గ్రామాలు, 14 గ్రామ పంచాయితీలు ఉండగా అధికారులు 31 పోలింగ్ బూతులను ఏర్పాటు చేశారు. తాడిమర్రి, పెద్దకోట్ల, కునుకుంట్ల, దాడితోట తదితర గ్రామాల్లో ఉదయం 6 గంటలకే ఓటర్లు క్యూ కట్టారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మహిళా ఓటర్లు పోటెత్తారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా పలు పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6 గంటలకే పోలింగ్ ముగియగా ఎం.అగ్రహారంలో ఈవీఎంలుల మొరాయించడంతో రాత్రి 8.30 గంటల వరకూ కొనసాగింది. మండలంలో మొత్తం 25,552 ఓటర్లుండగా 23,208 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 90.82 శాతం పోలింగ్ నమోదైంది. తాడిమర్రిలో డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ఎస్ఐ నాగస్వామి ఆరు మొబైల్ బృందాలను ఏర్పాటు చేసి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముదిగుబ్బలో ప్రశాంతం

ముదిగుబ్బ: మండల వ్యాప్తంగా సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మండల వ్యాప్తంగా 47,063 61 బూత్‌ల్లో 87.72 శాతం ఓట్లు పోలయ్యాయి. ముదిగుబ్బలోని పోలింగ్ కేంద్రాలను జనరల్ అబ్జర్వర్ దీపక్ రామచంద్ర, ఎలక్షన్ అబ్జర్వర్ రాహుల్‌దేవ్ సింగ్, ఎస్పీ మాధవరెడ్డి ఎన్నికల సరళిని పరిశీలించారు. ఉదయం ముదిగుబ్బ వర్షం కురుస్తున్నా గొడుగులు తీసుకొని ఓటర్ల వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జొన్నలకొత్తపల్లి పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ, బీజేపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని పరస్పర ఆరోపణలు చేసుకోవడంతో పోలీసుల రంగ ప్రవేశం చేసి వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు.